

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | గురువారం 02 నవంబర్ 2023 | www.navatelangana.com

గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్న మంత్రి

- ఆయనపై ఈసీ చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ బాల్కొండ అభ్యర్థి సునీల్‌రెడ్డి డిమాండ్

4లో...



నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- సర్వం సిద్ధం చేయాలని అధికారులకు సూచనలు

8లో...



నేడు వేల్పూర్‌కు కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి



సిద్ధమైన సభా వేదిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం బాల్కొండ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనేందుకు వేల్పూర్ రానున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. వేల్పూర్ మండలంలోని స్పైస్ పార్క్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి.. పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ గ్యాదరి బాల మల్లు తో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. సభ జరిగే వేదిక, సభకు తరలి వచ్చే ప్రజల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.





సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్..

కేసీఆర్‌తో పోటీ అంటే షబ్బీర్‌కు భయం

రేవంత్‌రెడ్డి వస్తే.. గంపకింద కమ్ముదాం

- అదాని పంపుతున్న సిమెంట్, సలాకా పంచుతున్న బీజేపీ
- కేసీఆర్ గెలిస్తే.. అసైన్డ్ భూములు అమ్ముడు కాదు.. దళితులకు అందజేస్తం
- ప్రజాఆశీర్వాద సభల్లో మంత్రి కేటీఆర్
- విప్ కోరిక మేరకే సీఎం పోటీ చేస్తున్నారని మరోసారి పునరుద్ఘాటన

నవతెలంగాణ-భిక్కనూర్/దోమకొండ

'గంప గోవర్ధన్ చేతిలో మూడుసార్లు ఓడిపోయిన షబ్బీర్ అలీ కెసిఆర్‌పై గెలవడం కష్టమని నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు తెలిసింది. కెసిఆర్‌పై పోటీ చేయడానికి రేవంత్‌రెడ్డి వస్తుండట. ఈసారి కూడా అదే గంప కింద రేవంత్‌రెడ్డిని కప్పి పెట్టాలని' ప్రజలకు మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. గంపగోవర్ధన్ కోరిక మేరకే కేసీఆర్ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని, లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి నియోజకవర్గం లోని భిక్కనూర్, దోమకొండ మండల కేంద్రాల్లో బుధవారం ప్రజాఆశీర్వాద సభలకు హాజరై ప్రసంగించారు. ఆదాని పంపిస్తున్న సలాకా సిమెంటును బిజెపి అభ్యర్థి పంపిణీ



చేస్తున్నారని, కుల సంఘాలకు ఇస్తున్నంత మాత్రాన ప్రజలు ఓటు వేయరని, కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను చూసి ప్రజలు ఓటు వేస్తారని తెలిపారు.

వార్త మెయిన్ పేజీలో...

అభ్యాసన సామర్థ్యాలు పెంచేలా..
గుణాత్మక విద్యను బోధించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చిట్ల పార్థసారథి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న ఎన్నికల కమిషనర్ పార్థసారథి

అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా గుణాత్మక విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. తన తల్లిదండ్రులు చిట్ల ప్రమీల - జీవన్ రాజ్ పేరిట నెలకొల్పిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో బుధవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని పెర్కిట్‌లో విద్యా స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. మండలం పరిధిలోని 21 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు, ఆంగ్ల మాధ్యమంలో గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించే 140 మంది ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాల పెంపుపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్.సి.ఈ.ఆర్.టీ) నిపుణులతో ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు.

వార్త మెయిన్ పేజీలో...

అసంతృప్తులే.. అభ్యర్థులు

- అభ్యర్థులను ఖరారు చేసేందుకు పార్టీల ఎదురుచూపులు
- ఎల్లారెడ్డిలో మారుతున్న సమీకరణాలు
- బీజేపీలోకి వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్న సమయం దగ్గరపడుతున్నా కొద్దీ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పార్టీల నుంచి టికెట్ వస్తాయని ఆశపడి భంగపడ్డ వారిని ఇతర పార్టీల వారు తమ వైపు తిప్పుకుంటున్నారు. అందుకే టికెట్‌ల కేటాయింపు పట్ల



ఆచితూచీ వ్యవహరిస్తున్నారు. దీంతో సమీకరణాలు మారుతున్నాయి. కాగా అసంతృప్తులను సముదాయించి ఓట్లు చీలకుండా ఆయా పార్టీల అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

2లో...

ఎంపీ బీబీపాటిల్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బీఆర్ఎఎస్ పార్టీ నాయకుల అధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జహీరాబాద్ ఎంపి బీబీ పాటీల్ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ శివానంద్, జుక్కల్ సర్పంచ్ బొంపెలి రాములు , బస్వాపూర్ సర్పంచ్ రవిపటేల్ నీలుపటేల్, మాజీ మార్కెట్ చైర్మేన్ సాయాగౌడ్, నాయకులు శీవాజీ పటేల్, సత్యప్పా గూరుజీ, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నర్సరీలో మొక్కలు సిద్ధం చేయాలి

నవతెలంగాణ-జుక్కల్

ఉపాధి హామీ కింద మండలంలో నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు ప్లాస్టిక్ బ్యాగులల్లో మట్టిని నింపి సిద్ధం చేయాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. బుధవారం గ్రామపంచాయతీ సెక్రట్రీలు, ఎఫ్ఎలతో ఎంపిడివో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపిడివో నరేష్, ఉపాధి హామీ ఈసీ స్వామీదాస్ మాట్లాడుతూ గ్రామాలలో మొదట మట్టిని సేకరించాలని, మూడు రకాల మట్టిని కలిపి జల్లేడ పట్టి నిబంధనలకు లోబడి ప్లాస్టిక్ సంచులల్లో మట్టిన నింపాలని, విత్తనాలు రాగానే అందిస్తామని తెలిపారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వార్డు మెంబర్‌లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే ఫామ్ హౌస్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే జాజల సురేందర్ ఆధ్వర్యంలో బిజెపి నుండీ బి ఆర్ ఎస్ లోకి వెంకటపుర్ గ్రామ వార్డు మెంబెర్లు చేరారు. వీరికి ఎమ్మెల్యే జాజల సురేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకటపుర్ గ్రామానికి చెందినా వార్డు మెంబెర్లు సురేందర్, మంద్రు రాములు, సాంగోజిపేట శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ సాంగోజిపేట అంజయ్య తదితరులు పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-భిక్కనూర్

బిక్కనూర్ మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన 20 మంది బిజెపి, కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు బీఅర్ఎస్ రాష్ట్ర యూత్ ప్రతినిధి గంప శశాంక్ సమక్షంలో బుధవారం బిఅర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంప శశాంక్ మాట్లాడుతూ 30 రోజులపాటు యూత్ నాయకులు సైనికుల్లా పనిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ముఖ్యమంత్రి గెలిచిన తర్వాత నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, మండల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, జెడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బుర్రి రంజిత్ వర్మ పార్టీ సీనియర్ నాయకుడు నాగన్నగారి మల్లారెడ్డి, గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి చేశాం.. ఓటు వేసి ఆదరించండి


ప్రచారంలో పాల్గొన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామాల్లో సంక్షేమం అభివృద్ధి చేశామని ఓటు వేసి ఆశీర్వదించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ అన్నారు. బుధవారం నసురుల్లాబాద్ మండలం లోని హజీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోచారం శ్రీణివాస్‌రెడ్డి తరఫున గడపగడపకు ప్రచారం నిర్వహించారు. పోచారం హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వారంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, సర్పంచులు అరిగే అంజయ్య శ్యామల శ్రీనివాస్, అంకోల్ రాము, దుర్కి మోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అసంతృప్తులే.. అభ్యర్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత ఎన్నికల్లో జాజాల సురేందర్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందగా.. అభివృద్ధి ధ్యేయంగా అధికార పార్టీలో మారారు. ప్రస్తుతం మరోసారి బీఆర్ఎస్ అధిష్టానం బీ ఫాం కేటాయించింది. గత ఎన్నికల్లో ఓడిన ఏనుగు రవీందర్ రెడ్డి బిజెపిలో చేరి, ఆ పార్టీలో ఇమడలేక కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ బీఫామ్ కోసం వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, కల్వకుంట్ల మదన్మోహన్ రావు ఎవరి ప్రయత్నాలు చేసినా అధిష్టానం మదన్‌మోహన్‌రావుకు టికెట్ కేటాయించింది. గత ఎన్నికల్లోనే తన టికెట్ త్యాగం చేసిన వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి.. ఈసారి ఖచ్చితంగా టికెట్ దక్కుతుందని ఆశించినా నిరాశే ఎదురైంది. దీంతో నియోజకవర్గ నాయకులతో, కార్యకర్తలతో గత రెండు రోజులుగా సమావేశాలు ఏర్పాటు చేసి, విస్తృతంగా చర్చలు నిర్వహించారు. అభిమానుల సూచన మేరకు బుధవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. టికెట్ దాదాపు ఖరారు చేసే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో త్రిముఖ పోరు

సురేందర్ అధికార పార్టీ చేసిన అభివృద్ధి ప్రచారం చేయనుండగా, మదన్ మోహన్ రావు గత కొద్ది రోజుల నుండి నియోజకవర్గంలో ప్రజలకు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తుండటం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే బలంగా, గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ప్రచారాస్త్రంగా మలుచుకున్నారు. సుభాష్ రెడ్డి కూడా నియోజకవర్గం లో స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా ప్రజలకు ఉచిత బస్సు, మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజల్లో ఉన్నానని ధీమాగా ఉండడం, కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇవ్వకున్నా, కార్యకర్తలు అండగా ఉన్నారని బిజెపిలో చేరికతో యువ జనం అండగా ఉంటారని గెలుపు పై ధీమాగా ఉన్నారు.

టీజేఎస్ అభ్యర్థిగా విద్యార్థి నాయకుడు నిజ్జన రమేష్ ఎల్లారెడ్డి నుంచి బరిలో దిగేందుకు యత్నించినా.. పొత్తులో భాగంగా టీజేఎస్ ఎన్నికల బరిలో నిలవకుండా.. కాంగ్రెస్‌కు సహకారం ఇవ్వనున్నట్టు ప్రకటించింది. దీంతో ఆయన సైతం స్వతంత్రంగా బరిలోకి దిగుతారా..? లేకుంటే వేరే ఇతర పార్టీలో చేరుతారా అన్ని తేలాల్సి ఉంది.

రానున్న రోజుల్లో ద్వితీయ శ్రేణి నాయకులు ఏ పార్టీ వారు, ఏ పార్టీలో చేరుతారోనని చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఏది ఏమైనా కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యన పోటీ ఉంటుందని చర్చ జరుగుతున్నా, ఎన్నికలకు దాదాపు నెలరోజులు ఉండటంతో మునుముందు రాజకీయాల్లో ఇంకెన్ని చిత్ర విచిత్రాలు చూడవలసి వస్తుందో వేచి చూడాలి.

ఎమ్మెల్యేను గెలిపించుకుందాం

- అభివృద్ధి పనులు సాధించుకుందాం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని హెచ్ కేలూర్ గ్రామంలో కొన్ని అభివృద్ధి పనులు జరగవలసిన వాటి గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లేందుకు మహిళలు గుమిగుడగా ఎమ్మెల్యే ప్రచారంలో భాగంగా హడావుడిగా వెళ్లిపోవడంతో మాజీ సర్పంచ్ నర్సింలు గౌడ్ ఆ గ్రామ మహిళలతో మాట్లాడారు. ఇప్పటివరకు గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని కొన్ని పనులు జరగవలసి ఉన్నా వాటిని ఈసారి ఎమ్మెల్యేను గెలిపించుకుందాం మిగిలిన అభివృద్ధి పనులను సాధించుకుందాం.. అంటూ హామీ ఇవ్వడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతితోనే 'మీడియా'లో ప్రచారం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా సోషల్ మీడియాలో గాని ఇంటర్నెట్ బేస్డ్ మీడియాలో, వెబ్ సైట్లలో, రేడియో, (ఎఫ్ఎం) ఛానళ్లలో ఎన్నికల ప్రచారం చేయరాదని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామజిక మాధ్యమాలైన వాట్సాప్ , ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్, ట్విట్టర్, రేడియో, ఎఫ్. ఎం. ఛానళ్ల తదితర మాధ్యమాలలో ఎన్నికల ప్రకటనలు జారీ చేయాలనుకున్న వారు తప్పనిసరిగా ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నుండి అనుమతి తీసుకోవాలన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, వ్యక్తులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు సమర్పించి అనుమతి పొందలని సూచించారు. సోషల్ మీడియా పోస్టులపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. సోషల్ మీడియా ప్లాటుఫారాలన్నింటికీ కూడా ఎలక్ట్రానిక్ మీడియా నియమ నిబంధనలు వర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి ప్రకటనలు ఉండాలని పేర్కొన్నారు. గ్రూపులో సభ్యులు ఎవరైనా రెచ్చగొట్టే కామెంట్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగేంచే నాయకుల ప్రసంగాలు వైరల్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్ లపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ పాటిల్

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే ఫామ్ హౌస్ కార్యాలయంలో బుధవారం బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బబ్లు ఎమ్మెల్యే జాజల సురేందర్ సమక్షంఓ సుమారు 200 మంది యువకులు మహిళలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే సురేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి పాటుపడు తున్న ప్రభుత్వం బి ఆర్ ఎస ప్రభుత్వం అని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో దంతమంది స్కీం తీసుకొచ్చి దళితుల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని అన్నారు. రాజ్యాంగం కల్పి కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించాలని అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని పట్టం కట్టాలని అన్నారు. ఎలక్షన్స్ వస్తున్నాయని ప్రతి ఒక్కరు వచ్చి ఏవో హామీలు ఇచ్చి మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తారు మీరు ఓటు అనే ఆయుధం తో బి ఆర్ ఎస్ ను గెలిపించి ప్రతి పక్షాలకు సరైన సమాధానం చెప్పాలని కోరారు.బీఎస్పీ నుండి బి ఆర్ ఎస్ చేరినా వారిలో ఎల్లారెడ్డి మండల ఉపా అధ్యక్షుడు చిరంజీవి, కోశాధికారి గౌతమ్, నాగిరెడ్డి పెట్ మండల అధ్యక్షుడు సుభాష్, తడువాయి అధ్యక్షుడు అనిల్,రాజు, విజయ్,మహేష్,చందు,శ్రీను తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, జడ్పిటిసి, ఉష గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఏటీఎం చోరికి విఫలయత్నం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో బస్టాండ్ ఆవరణలో గల ఏటీఎంలో చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. బుధవారం తెల్లవారు జామున సుమారు మూడు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు ఏటీఎంను లూటీ చేసేందుకు యత్నించారు. సాధ్యం కాకపోవడంతో సీసీ కెమెరాలను ఏటీఎం డిస్‌ప్లేను, ఏటీఎం మిషిన్‌ను ధ్వంసం చేశారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ ప్రేమ్ దాస్ తెలిపారు.


ఏటియంను పరిశీలిస్తున్న పోలీసులు

బీఆర్ఎస్ పార్టీకి షాక్


కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-సదాశివపగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెందిన ఎంపీటీసీ లక్ష్మీరాజలింగం సుమారు 200 మంది బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు లింగాగౌడ్,మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఈర్షద్, సీనియర్ నాయకుడు అజీమ్ తదితరులు ఉన్నారు.

వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

వికలాంగుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో వికలాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదని తెలిపారు. వారు ఎవరికి భారం కాకూడదని ఆర్థిక ఇబ్బందులను గుర్తించి దేశంలో ఎక్కడా లేని విధంగా అధిక పింఛన్ ఇస్తున్నారని తెలిపారు. 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన వారికి రుణాలు ఇచ్చి చేయూతనిచ్చారని వివరించారు. ప్రజల కష్టాసుఖాలు తెలిసిన నాయకుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి-సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్తుందన్నారు. నిజామాబాద్ నగరంలోని ప్రతిగడపకూ సంక్షేమ పథకాలను అందించామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, బి.ఆర్.ఎస్ నాయకులు దండు శేఖర్, యెనుగందుల మురళి, పోల నారాయణ, పంచారెడ్డి సూరి, ముచుకుర్ నవీన్, వెల్డింగ్ నారాయణ, ముత్యాలు, బైఖాన్ మదు, రాజేంద్ర ప్రసాద్, శివ చరణ్, ఎర్రం గంగధర్, మహిళ నాయకులు చంద్ర కళ, చాంగు భాయి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్

ఇంటింటికి తిరుగుతూ అర్బన్ ఎమ్మెల్యే బిగాల ప్రచారం..

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల 48, 25వ డివిజన్‌లలోని పాటి గల్లీ, జెండా గల్లీ, కోటగల్లీ, గోల్ హనుమాన్ కాలనీలలో బుధవారం ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పల్లె, ప్రతి పట్టణంలో శాంతియుత వాతావరణం నెలకొందన్నారు. నిజామాబాద్ నగరంలో అభివృద్ధి చేయని గల్లీ లేదు, సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి, మినీ ట్యాంక్‌బండ్, అధునిక సదుపాయాలతో నిర్మించిన వైకుంఠధామాలు నిజామాబాద్ ప్రగతికి నిదర్శనమన్నారు. యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ కొరకు న్యాక్ భవనం నిర్మించామన్నారు. ఐటీ టవర్ నిర్మించి 400 మందికి స్థానికులకు ఉద్యోగాలు కల్పించామన్నారు. ప్రగతికి మారుపేరు బి.ఆర్.ఎస్ పార్టీకి ఓటు వేయండి, మరింత అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, గజ్జెటి వెంకట నర్సయ్య, యెనుగందుల మురళి, 48వ డివిజన్ నాయకులు సత్యపాల్, పుంద్ర నరేష్‌రెడ్డి, రేసు హన్మాండ్లు, పబ్బా సాయిప్రసాద్, 25వ డివిజన్ కార్పొరేటర్ సిరిగాధ ధర్మపురి, కోఆప్షన్ సభ్యులు అంతారెడ్డి లత దేవేందర్, చింతకాయల రాజు, పుప్పాల రవి, కస్తూరి గంగరాజు, శివ ప్రసాద్, పాలకొండ నర్సింగ్ రావు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు కరాటేలో శిక్షణ


కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థినిలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కరాటేలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలికల స్వయం రక్షణ కొరకు ప్రతీ సంవత్సరం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మ రక్షణలో భాగంగా పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న తెలిపారు. ఈ కార్యక్రమం 3నెలల పాటు నిర్వహించాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు అందినట్టు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం, కరాటే శిక్షకులు అభినాష్, శివాని, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మంచిప్ప గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన ఆదివాసి నాయక్ పోడు సంఘం తంపున సుమారు 30 కుటుంబాలు స్వచ్ఛందంగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా బలపరచడానికి బీఆర్ఎస్ పార్టీలో సర్పంచ్ సిద్దార్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ అజీమ్, సాయిరాం, శ్రీనివాసరావు, సర్పంచ్ ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బిఆర్ఎస్ పార్టీలో చేరిన గ్రామస్తులు

మంత్రి ప్రశాంత్ రెడ్డికే మా మద్దతు

- బిల్యానాయక్ తండావాసుల ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికే తమ మద్దతు అని పేర్కొంటూ మండలంలోని అమీర్‌నగర్ గ్రామ పరిధిలోని బిల్యానాయక్ తండా ప్రజలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తండాలో ఉండే అన్ని కుటుంబాల సభ్యులు మొత్తానికి మొత్తం ఏకగ్రీవ తీర్మానంతో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి తమ మద్దతు పలికారు. బుధవారం తండాలో ఉన్న సేవాలాల్ జగదాంబ గుడి ఆవరణలో తండా వాసులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. తండా ప్రజల నిర్ణయం మేరకు దైవ సాక్షిగా బాల్కొండను అభివృద్ధి పరుస్తున్న ప్రశాంత్‌రెడ్డికి, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు చేసి, బంజారా భవన్‌లు, పోడు పట్టాలు ఇచ్చి ఆదుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వానికి ఎల్లవేళలా మా పూర్తి మద్దతు ఉంటుందని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఏకగ్రీవ తీర్మానం ప్రతిని తండా బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలావత్ ప్రకాష్‌కు అందజేశారు. బాల్కొండ నియోజకవర్గంలో దైవసాక్షిగా ఒక నాయకుడికి మద్దతు ఇస్తాం అని చెప్పడం ద్వారా బిల్యానాయక్ తండా వాసులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, గిరిజనలు, తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవ తీర్మాణ పత్రాన్ని అందజేస్తున్న తండావాసుల

ఏకగ్రీవంగా తీర్మానించడం అభినందనీయం

- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో క్షత్రియ పెర్క సంఘ కులస్తులు బుధవారం సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేయడం అభినందనీయమని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి దాస్ మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కోట్ల రూపాయల మేర అభివృద్ధి చేశారని, ఈసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటే మంత్రి పదవి ఖాయమని, దీంతో రూరల్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వద్దకు ఏ వర్గానికి చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వెళ్తే వారందరిని కాదనకుండా సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే పరిష్కారానికి కృషి చేశారని అలాంటి నాయకునికి రూరల్ ప్రజలు వదులుకోవద్దని సూచించారు. వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, బీఆర్ఎస్ రూరల్ ఎస్సీ కన్వీనర్ పాశం కుమర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తేలు విజయ్‌కుమార్, ఎంపిటిసి కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు అరటి రఘు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ బాదవత్ రమేష్‌నాయక్

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కల్పోల్ గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎంపిపి లతా కన్నీరం, జడ్పిటిసి కమల నరేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మున్నూరు కాపు సమ్మేళనానికి తరలిన నాయకులు

నవతెలంగాణ-మోపాల్

బృందావన్ గార్డెన్‌లో బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో చేపట్టిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి మంచిప్ప సర్పంచ్ సిద్దార్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మున్నూరు కాపు కులస్తులందరూ పాల్గొనడానికి తరలివెళ్లారు.


సమ్మేళనానికి తరలిన నాయకులు

బోధన్ మండలంలో మాజీమంత్రి ప్రచారం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బండార్‌పల్లి, రాంపూర్, కల్దుర్కి, సిద్దాపూర్, ఖండ్‌గావ్, బెల్నెల్లి గ్రామాలలో బుధవారం మాజీమంత్రి సుదర్శ న్‌రెడ్డి గడప గడప కు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అమలుచేసే 6 గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచారంలో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు నాగేశ్వర్, యూత్ మండలాధ్యక్షులు కంటే రాజు, మంధర్న రవి తదితరులు పాల్గొన్నారు.

3న వాహనాల వేలం పాట

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఆబ్కారి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో దొరికిన వాహనాలకు ఈనెల 3న వేలం పాట నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ దిలీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసులలో దొరికిన రెండు ఆటోలు, ఎనిమిది ద్విచక్ర వాహనాలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాయని తెలిపారు. కావున వాహనాల వేలం పాటలో పాల్గొనేవారు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్ బోర్గాం పాంగ్ర వద్ద సంప్రదించాలని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నిజామాబాద్ దిలీప్ తెలియజేశారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ పిలుపునిచ్చారు. నగరంలోని అంబేద్కర్ కాలనీలో ఈ సభను గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించునున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు వ్యవస్థపాక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభను జయప్రదం చేయడానికి మాదిగలు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

45వ జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హనుమకొండలో కాకతీయ యూనివర్సిటీలో అక్టోబర్16 నుండి 17 వరకు జరిగిన 10వ రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలో మంచి ప్రతిభను కనబరిచి టోర్నమెంట్‌లోనే ఉత్తమ పిక్చర్‌గా ప్రత్యేక బహుమతి అందుకున్న ఎల్.రాణి 45వజాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ గోదావరి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోదావరి మాట్లాడుతూ జాతీయస్థాయిలో రాణించి రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. ఈ ఏడాది

సీనియర్ విభాగంలో అంతర్జాతీయ పోటీలకు భారత జట్టు తరపున పాల్గొన్నట్లు తెలిపారు. నవంబర్ 4 నుంచి 8 వరకు జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరగబోయే జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలలో రాణి పాల్గొనుందని వివరించారు. రాణిని అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాని, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, మౌనిక రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక తదితరులున్నారు.


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థిని

దేశ రైతాంగానికి భరోసా.. కేసీఆర్

- కాంగ్రెస్ గ్యారెంటీలు అన్ని బూటకం.. • మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

యావత్ దేశ రైతంగానికి కేసీఆర్ భరోసాని మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, హర్యానా రైతు సంఘాల నాయకులు అన్నారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలోని కేసిఆర్ ఫంక్షన్ హాల్లో అఖిల భారత రైతు సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావే శంలో తెలంగాణ రైతు పథకాలపై వారు కూలంకషంగా చర్చించారు. తెలంగాణ, సౌత్ ఇండియన్ ఫార్మాస్ ఫెడరేషన్ అధ్యక్షులు కోట పాటి నర్సింహానాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సమావేశంలో పలు రాష్ట్రలకు చెందిన స్థానిక రైతులు హాజర య్యారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం గ్యారెం టీలు అని అబద్ధాలు చెప్తుందని, కర్ణాటకలో తాము నమ్మి ఓట్లు వేసి మోసపోయామని, తెలంగాణ ప్రజలు మోస పోకండని కర్ణాటక రైతు సంఘం నాయకుడు పరుశురాం లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయానికి 5 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారని, అది కూడా అర్ధరాత్రి ఇస్తున్నారని తెలిపారు. కర్ణాటకలో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడ కేసిఆర్ 24 గంటల కరెంట్ ఇస్తూ రైతులను కంటికి రెప్పలా చూసుకుం టున్నడని వారు అభిప్రాయపడ్డారు. రైతుకోసం కేసిఆర్‌లా ఆలోచించే నాయకుడు దేశంలోనే ఎవరూ లేరన్నారు.

కేసిఆర్‌ను కాదనుకుంటే తినే పళ్ళెంలో మన్ను పోసుకున్నట్టే : మంత్రి

కేసిఆర్‌ను కాదనుకుంటే తినే పళ్ళెంలో మన్ను పోసుకున్నట్టేనని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఏదో రకంగా రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న ఆలోచనతో కాంగ్రెస్ ఇక్కడ గొప్పలకు పోతుందని విమర్శించారు. అలివి కానీ హామీలు ఇస్తున్నది కానీ వాళ్ళు పాలిస్తున్న రాష్ట్రాల్లో రైతులను అరిగోస పెడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన మోసానికి కర్ణాటక రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతుల గోసలు అనేకమన్నారు. కేసిఆర్ లాంటి రైతు పక్షపాతి నాయకున్ని కాపాడుకోవటానికి వాళ్ల ఇక్కడికి వచ్చి రైతులను చైతన్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలు అన్ని బూటకం..ఓట్ల కోసం మాత్రమే వాళ్ళ డ్రామాలాడుతరని అన్నారు. రైతుల బాగు కోరే కేసిఆర్ లాంటి నాయకునికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కేసిఆర్ గెలిస్తే రైతు గెలిచినట్టే అని మంత్రి వేముల అన్నారు.

గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్న మంత్రి

- ఆయనపై ఈసీ చర్యలు తీసుకోవాలి • కాంగ్రెస్ పార్టీ బాల్కొండ అభ్యర్థి సునీల్‌రెడ్డి డిమాండ్

నవతెలంగాణ-మోర్తాడ్

మంత్రి ప్రశాంత్‌రెడ్డి గత రెండు రోజుల క్రితం 'ప్రశ్నించే వారిపై దాడులు చేయండి' అంటూ బహిరంగంగా మాట్లాడడంపై ఈసీ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ బాల్కొండ అభ్యర్థి సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రజానీలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలలో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై అధికార పార్టీ కార్యకర్తలు దాడులు చేయాలంటూ కార్యకర్తలకు సూచించడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజాప్రయోజనాలకు పని చేయాల్సిన మంత్రి పదవిలో ఉన్న ప్రశాంత్‌రెడ్డి రౌడీ రాజకీయాలను కార్యకర్తలకు నేర్పడంపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు సంక్షేమ పథకాలు అందలేవని ప్రజలు ప్రశ్నిస్తే వారిని బూతుమాటలతో దూషిస్తూ దాడులు చేయాలని కార్యకర్తలకు సూచించడం హేయమైన చర్య అని దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మంత్రి ఆగడాలను బాల్కొండ నియోజకవర్గ ప్రజలు గమనించాలని సూచించారు. నియోజకవర్గంలో గంజాయి రవాణా భారీగా కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ గత కొన్ని సంవత్సరాల నుంచి ఆరోపించినా మంత్రి వాటిపై చర్య తీసుకోలేదన్నారు. నియోజకవర్గంలో మంత్రి తమ్ముడు ప్రభుత్వ ఉద్యోగ జీతం తీసుకుంటూ ఇక్కడ ఎందుకు రాజకీయ కార్యకలాపాలు పాల్గొంటున్నాడని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయాలని అన్నారు. మంత్రి, తన తమ్ముడు చేస్తున్న అరాచకాలపై ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు.



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయించాలి..

గత 2018 ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మోర్తాడ్ బహిరంగ సభలో రైతులు పండించిన పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న పంటలను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసి ఫుడ్ ప్రాసింగ్ చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేటికీ అమలు చేయలేదని వాటిని తక్షణమే అమలు చేసి నియోజకవర్గ పర్యటన చేపట్టాలని అన్నారు. కేవలం ప్రజలను మభ్యపెడుతూ హామీలు ఇచ్చి అమలు చేయకుండా రైతులను నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారని అలాంటి హామీలను కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీ హామీలను కాపీ కొడుతూ నూతన హామీలను అమలు చేస్తామండడం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి గత హామీలను తక్షణమే అమలు చేయాలని నేడు జరిగే బహిరంగ సభలో కెసిఆర్‌కు సూచించాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల అంచనకే విద్యా సాధన సర్వే

- మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నవంబర్ 3వ తేదిన నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యా సాధన సర్వే పరీక్షకు ఆయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిద్ధం కావాలని బాల్కొండ మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. బుధవారం బాల్కొండ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాలను అంచన వేయడానికి 3,6,9 తరగతుల వారికి పరీక్ష నిర్వహిస్తామని, ఈ పరీక్షలో భాగంగా విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం, సైన్స్, సాంఘీక సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలోని పలు అంశాలపై వారితో సమిక్షించారు. కార్యక్రమంలో మండల్ నోడల్ ఆఫీసర్స్ శ్రీనివాస్, రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు కొనసాగుతున్నాయి. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాబర్ ఖాన్, అజార్, కంజీర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. హాసకొత్తూర్ గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం, వడ్డెర సంఘం, గిరిజన సంఘం, బంజారా సంఘాలకు చెందిన సుమారు 250 మంది కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కోనా సముందర్ గ్రామానికీ చెందిన రెడ్ బుల్స్ యూత్, శివాజీ యూత్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. బాల్కొండ నియోజకవర్గం లోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగి మండలం మానాల గ్రామానికీ చెందిన కిషన్, రవి, నరేష్, రాజేందర్, సంతోష్ మరో 60 మంది కాంగ్రెస్ లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రభాకర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- నిజామాబాద్ అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

దుబ్బాక నియోజకవర్గం బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి నగర మేయర్ దండు నీతుకిరణ్, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ దండు నీతు కిరణ్ మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో శాంతియుతంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతివైపు పరుగెత్తిస్తున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓర్వలేక ఎలాగైనా అధికారంలోకి రావాలని హింస రాజకీయాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆకుల సుజాత, బి.ఆర్.ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, యువజన విభాగం అధ్యక్షులు బొబ్బిలి మురళి, టిఆర్ఎస్వి నగర అధ్యక్షులు రంగు సీతారాం, మాజీ కార్పొరేటర్ శివ చరణ్, సాధు సాయి వర్ధన్, మాజీ కార్పొరేటర్లు సిర్ప సువర్ణ, పుప్పల లావణ్య, రంగు అపర్ణ, నాయకులు నిచెంగు కృష్ణ, చిదుర శ్రీను, పాల్తీ రవి కుమార్, సంపత్, మాదని శ్రీధర్, భాజన్న, పద్మ శ్రీను, భారీ తదితరులు పాల్గొన్నారు.



వినతినిస్తున్న నాయకులు

ఏర్గట్ల : దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై రాజు అనే దుండగుడు కత్తితో పొడిచి దాడి చేయడాన్ని ఏర్గట్ల మండల బీఆర్ఎస్ పార్టీ తరపున ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. రాజు పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏర్గట్ల ఎమ్మార్వో కార్యాలయంలో ఆర్.ఐకి ఫిర్యాదు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్, పత్తిరెడ్డి ప్రకాష్, కుండ నవీన్, కట్కం పద్మాసాగర్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-బోధన్ టౌన్/రెంజల్

పట్టణంలోని పలు వార్డులలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

రెంజల్ : మండలంలోని బోర్గం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని గ్రామంలోని మహిళలు గడపగడపకు ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం డిపార్ట్మెంట్ డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సిఐ యం.డి మోకీబ్ పాషా సైబర్ క్రైమ్ ఈరోజుల్లో ఎలా జరుగుతున్నాయో విద్యార్థులకు వివరించారు. వీటి వల్ల జరిగే నష్టాలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధీర్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ డా.గణేష్, డా.శ్రీకాంత్, ప్రొఫెసర్ ప్రకాష్ పాటిల్, స్వప్న, వాసుగౌడ్, శివరంజని ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- **గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆకాంక్ష**

నవతెలంగాణ-డొంకేశ్వర్

ఆడుకోవాల్సిన వయసులో ఆ బాలిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. తమ బిడ్డను బతికి పంపాల్సిన సమయంలో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు ఆ తల్లిదండ్రులు. పాపకు గుండెకు సంబంధించిన వ్యాధి రావడంతో ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

డొంకేశ్వర్ మండలంలోని నూతపల్లి గ్రామానికి చెందిన లావణ్య భోజన్న దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు. మొదటి సంతానమైన ఆకాంక్షకు 13 సంవత్సరాలు. ప్రస్తుతం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తన తండ్రి ఆటో డ్రైవర్ సంవత్సరం కింద గల్ఫ్‌కు వెళ్లి.. కూతురు ఆరోగ్యం బాగోలేక నెల క్రితం తిరిగి వచ్చాడు. తల్లి బీడీ కార్మికురాలు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు.



చికిత్స పొందుతున్న ఆకాంక్ష

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు..

బాలిక ఆరు నెలల కింద గుండె సంబంధిత వ్యాధికి గురైంది. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడంతో గుండె సంబంధిత వ్యాధికి గురి అయినది. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో మూడు లక్షలు ఖర్చయ్యాయి. గుండెకు సంబంధించిన జబ్బు కావడంతో హైదరాబాదులోని రెయిన్‌బో హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. పాపకు గుండె ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు చెప్పారు. ఆపరేషన్‌కు రూ.10 లక్షలు ఖర్చవుతుందని తెలపడంతో చేతిలో చిల్లీ గవ్వలేకపోవడంతో అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఆ తల్లిదండ్రులున్నారు. దాతలు సహకరించి తమ బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటున్నారు. అందుకుగానూ 9490059856 లావణ్య, 9912407972 కృష్ణ గూగుల్ పే, ఫోన్ పే నెంబర్లు ఈ నెంబర్లకు తోచిన సహాయం చేయాలని వేడుకుంటున్నారు.

వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బుధవారం పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన శివాజీ యూత్, అంబేద్కర్ యూత్, 11 స్టార్ యూత్, ఫ్రెండ్స్ యూత్, శ్రీకృష్ణ యాదవ యూత్, రాయల్ యూత్ సభ్యులు, భీంగల్ పట్టణ నందిగల్లీ 3వ వార్డుకి చెందిన పలువురు యువకులు, బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, యువకులు మోర్తాడ్ మండలం పాలెం గ్రామ బీజేపీ పార్టీకి చెందిన యువకులు పెద్ద ఎత్తున సుమారు 300 మంది రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు.

మంత్రి వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు..

బాల్కొండ నియోజకవర్గ నలుమూలల అన్ని గ్రామాల నుండి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోంది. పలు కుల సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు. అందులో భాగంగా బాల్కొండ నియోజకవర్గ చిందు కళాకారుల సంఘం, మోర్తాడ్ మండల ఆదర్శ మున్నూరు కాపు సంఘం ఏకగ్రీవ తీర్మానాలు చేశారు.

కల్వర్టు గుంతలో కారు బోల్తా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని ఉప్లూర్ గ్రామానికి వెళ్లే దారిలో వరద కాలువ సమీపంలో బీటీ రోడ్డు పక్కన కోతకు గురైన కల్వర్టు గుంతలో మంగళవారం అర్ధరాత్రి కారు బోల్తా పడింది. భారీ వర్షాల మూలంగా కల్వర్టు పక్కన బీటీ రోడ్డు పెద్ద ఎత్తున కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతను పూడ్చకుండా, ప్రమాదాలు జరగకుండా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. మంగళవారం రాత్రి ఆ రోడ్డు గుండా కారులో వెళ్తున్న వ్యక్తి కోతకు గురైన రోడ్డు గుంతలను గమనించకపోవడంతో కారు గుంతల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టి తలకిందులుగా గుంతలో నిలబడింది. కారులో ఉన్న వ్యక్తి కార్ డోర్ అద్దాన్ని పగలగొట్టుకుని బయటకు వచ్చాడు. ఈ సంఘటనలో సదరు వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిసింది. ఈ విషయమే పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆదమరిస్తే అందులోకే..

ఉప్లూర్ వెళ్లే దారిలో వరద కాలువ దిగువన కుడివైపున ఉన్న కల్వర్టుతో పాటు,



మరో రెండు చోట్ల భారీ వర్షాల మూలంగా పెద్ద ఎత్తున బిటి రోడ్డు కోతకు గురైంది. వర్షాలు ముగిసినప్పటికీ కోతకు గురైన రోడ్డును బాగు చేయకపోవడంతో పాటు అధికారులు గుంతలను కూడా పూడిపించలేదు. ఈ దారిగుండా రాత్రి వేళలో ప్రయాణం చేసే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. అధికారులు తక్షణం స్పందించి ఇప్పటికే నిధులు భూమిపూజ జరిగినందున స్లాబ్ కల్వర్టు నిర్మాణం చేపట్టి, ప్రజలు ప్రమాదాలను బారిన పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు ఏజెంట్ రేవంత్‌రెడ్డి..

- **రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఏజెంట్ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని బర్దిపూర్ శివారులోని బృందావనం గార్డెన్స్‌లో నియోజకవర్గ మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఏకైక బీసీ నాయకుడిని తానేనని, మున్నూరుకాపు కులస్తులందరూ ఐకమత్యంగా ఉంటూ తనకు అండగా ఉండి బీసీ బిడ్డను బతికించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీలు అగ్రవర్ణాలకే పెద్దపీట వేస్తున్నాయని, బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. నిజామాబాద్ జిల్లాలో బీసీ వర్గానికి సంబంధించిన తనను మూడవ సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారని, నియోజకవర్గం ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని కోరారు. అంతకు ముందు మున్నూరు కాపులు ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌కు నాగలి బహూకరించి, గజమాలతో ఘనంగా సత్కరించారు. నల్లవెల్లి ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన డాన్సులు అందరినీ ఎంతగానో అలరించాయి. చిన్నారులను ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులు అభినందించారు. ఇందల్వాయి గ్రామానికి చెందిన 4 మున్నూరు కాపు సంఘాలు బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రూరల్ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న, జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్మోహన్, జిల్లా నాయకులు పట్వారీలక్ష్మణ్, రమాకాంత్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, కార్యదర్శి బూస ఆంజనేయులు, నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, ఎంపిటిసి కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, ఒడ్డెం నర్సయ్య, మధుసూదన్, సంతోష్, పులిసాగర్, పులి శ్రీనివాస్, రఘు, తేలు విజయ్ కుమార్, తేలు గణేష్, పాపాయి తిరుపతి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, ఏడు మండలాల మున్నూరుకాపులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు గజమాలతో సత్కారం

జాతీయ రహదారిపై తనిఖీలు ముమ్మరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 24గంటల పాటు 44వ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలాల పరిధిలోని జాతీయ రహదారిపై వచ్చి పోయే వాహనాలకు పోలీసులు సహకారంతో వీడియో షూటింగ్‌తో తనిఖీలను చేపడుతున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాములు నాయక్ తెలిపారు.

కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తలకు అవగాహన

నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్‌ఖాన్ బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగభూషణం రెడ్డి, సిహెచ్.రాములు, జి సాయిరెడ్డి, జావిద్ ఉద్దీన్, లచ్చేవార్ నితిన్, ధనుంజయ్, బి.రవి, సాయిబాబాగౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్తీక్ యాదవ్, సిద్ధ సాయిలు, శంషొద్దీన్, సయ్యద్ సల్మాన్, బుడ్డు, ఎల్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువ గర్జన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో గురువారం బోధన్ పట్టణంలో నిర్వహించనున్న యువగర్జన సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఖాజాపూర్, సాలూర గ్రామాలలో నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగయ్య, బస్వంత్, గౌతం, బాలరాజ్ యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, కంబాక్సులు అందజేత



పెన్నులు, కంపాక్సులు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఇందూర్ వారి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం లోని ఘన్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులకు 300 పెన్నులు, 150 బిస్కెట్ ప్యాకెట్స్, 8,9,10 తరగతుల విద్యార్థులకు 80 కంపాక్స్ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఆనంద్, ఎస్. నారాయణ, బి.రవి, శ్రీనివాసస్వామి, గంగాభవానీ, విజయలక్ష్మి, పిఈటీ డ్రాయింగ్ మాస్టర్ గంగాధర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో పోలీస్ కళాబృందం అవగాహన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళాబృందం వారిచే ప్రజలకు అవగాహన కల్పించినట్టు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. రాబోవు ఎన్నికలలో శాంతి వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత ద్వారా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, భద్రతా నియమ నిబంధనలను పాటించాలని ఆయన అన్నారు. అమరవీరుల నాటిక ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, పోలీస్ కళాబృందం వారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

3న పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు తెలంగాణ యూనివర్సిటీ లోని క్రీడా మైదానంలో ఈనెల 3న నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ క్రీడా విభాగ డైరెక్టర్ డాక్టర్ జి.బాలకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డిగ్రీ కళాశాలలు, పీజీ కళాశాలలు, వృత్తి విద్యా కళాశాలలో చదువుతున్న 17-21ఏళ్ల వారు అర్హులని వివరించారు. ఎంపికైన టీం 9న జేఎన్‌టీయు కాకినాడ తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో జరిగే పోటీలో పాల్గొంటారని తెలిపారు.

బీసీలకు సరైన ప్రాధాన్యత కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్బగోని అశోక్ గౌడ్


సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

బీసీలకు సరైన ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్బగోని అశోక్ గౌడ్ కోరారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అబ్బ గోని అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గంలో నూతన కమిటీలు, రాబోయే కాలంలో బీసీల గురించి చర్చ రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు అబ్బగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు సరైన ప్రాధాన్యత బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇతర పార్టీలు కేటాయించకపోవడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ఇప్పటికైనా మేలుకోవాలని 57శాతం ఉన్న బీసీలను విద్య, వైద్య, సామాజిక ఆర్థికపరంగా వారిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేవని వారికున్న చట్టబద్ధత ప్రకారం వారికి చట్టసభలలో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో బీసీ నాయకులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని, బీసీలకు కచ్చితంగా వెన్నంటే ఉండి నడిపించాలని వారు ఏ పార్టీలో ఉన్నా గాని బీసీలను గెలిపించుకోవాలని అబ్బగోని అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల తరుణంలో బీసీలకు రాజకీయ ప్రచారాల కోసం వాడుకోవడమే వారి ఎజెండాగా మారిందని తర్వాత బీసీలను చులకనగా చూడడం జరుగుతుందని, ప్రతి ఒక్క పార్టీ బీసీలనే టార్గెట్ చేసుకొని వారి ఎజెండాగా మార్చుకొని బీసీల ఓటు బ్యాంకుని వాడుకోవడం జరుగుతుందని ఇప్పటికైనా బీసీలు దీనిని గమనించి వారికి ఎవరైతే న్యాయం చేస్తారో వారికి ఓటు వేసి గెలిపించుకోవాలని తెలియజేశారు. అదే విధంగా ఈ రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నూతన కమిటీలు వేసినట్టు అశోక్ గౌడ్ తెలిపారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షులుగా బెస్త గంగారం, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ ఈసీ మెంబర్‌గా దాసరి మూర్తి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా ఇందిరపు పుష్పల, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం బాల్కొండ నియోజకవర్గ యువజన అధ్యక్షులుగా నూతనంగా బాధ్యతలను అప్పగించినట్టు తెలియజేశారు. సమావేశంలో సంఘం నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మురళీధర్ స్వామి, బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షులు బేస్త గంగారం, బాల్కొండ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ అందే వెంకటగిరి వివిధ మండలాల అధ్యక్షులు బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ముప్కాల్, ఫ్రెండ్లి పోలీస్ సంయుక్త భాగస్వామ్యంతో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్టు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలను సైతం నాటారు. మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించే సామాన్య నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఏఎస్సై తొగర్ల సురేష్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంబారు లక్ష్మీ నారాయణ, ఏఎస్సై తొగర్ల సురేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చాకు లింగం, సాగర్‌రెడ్డి, మెడికల్ విక్రమ్, పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ పిప్పర గణేష్, సభ్యులు రవి, నర్సయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిక


బిఆర్ఎస్ పార్టీలో చేరిన సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్(కురాకుల) సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి అబద్ధపు హామీలతో కుల సంఘాలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరికలు చేయించుకుంటున్నాడని, అతని పద్దతి మార్చుకోవాలని అన్నారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ఎవరెంత మభ్యపెట్టినా ఈ ఎన్నికల్లో ప్రశాంత్ రెడ్డికి అండగా ఉండి,భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని హామినిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జక్కని మధుసూదన్, పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, గుల్లే గంగాధర్, సున్నపు అంజయ్య, లూనా సాయన్న, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్‌తో ప్రచారం


కిట్‌తో ప్రచారం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

ఎన్నికల ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకోడానికి అధికార పార్టీల నాయకులు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చూపుతూ ప్రచారంలో దూసుకు పొతున్నారు. సాలూర మండలం మంధర్న గ్రామంలో సర్పంచ్ రావుబా గంగాధర్ ప్రభుత్వం అందించిన కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికి అందజేసిన పథకాలతో ఆయన వినూత్నంగా ప్రచారం చేస్తూ ఓటర్లకు ఆకర్షిస్తున్నారు. బుధవారం మంధర్న, జాడీజమాల్‌పూర్, పాత సాలంపాడ్, సాలూర, ఫతేపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో నాయకులు బుద్దె రాజేశ్వర్, నర్సారెడ్డి, మజార్, షేక్ అమీర్, నూర్ ఆస్మద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రితో ఒరిగేదేమీ లేదు

- ఎమ్మెల్యే షకీల్ ఆమెర్


బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గతంలో మంత్రిగా పనిచేసి కూడా బోధన్ నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ప్రస్తుతం 75 సంవత్సరాల వయసు పైబడిన పదవీ కాంక్షతో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఆయన బోధన్ ప్రజలకు చేసేదేమీలేదని ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలలో ప్రజాసేవ చేస్తూ చురుకుగా ఉండే వారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని కావున నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యతను ఇచ్చి జిల్లాలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్, బాల్కొండ లాంటి నియోజకవర్గంలో రెడ్డిలకే ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని బీసీ వర్గాలను విస్మరించారని అన్నారు. జనాభాలో 50శాతం ఉన్న బీసీలకు కనీసం ఏ ఒక్కటైనా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని అన్నారు. 15 సంవత్సరాల కాలంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కోట్ల రూపాయలు సంపాదించుకున్న బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి సహాయం చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతగల కౌన్సిలర్‌గా పనిచేసిన గుణప్రసాద్ కరోనా మహమ్మారితో చనిపోయిన ఇప్పటికి వారి కుటుంబానికి వెళ్లి పరామర్శించలేదని అన్నారు. అంటే మాజీ మంత్రికి ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంటే చులకన భావంతో చూస్తారని అన్నారు. కనీసం మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డికి బోధన్‌లో ఇల్లు లేదని ఆయన కోసం ఆయనను నమ్ముకున్న ప్రజలు ఎక్కడికి వెళ్లి మాట్లాడాలని అన్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాలలో మోసపూరితమైన హామీలతో అధికారంలో వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. బోధన్‌లో బిఆర్ఎస్ పార్టీకి, బిజెపి పార్టీకే ప్రధాన పోటీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోనే ప్రజలకు అద్భుతంగా ఉపయోగకరంగా ఉందని ఆ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుందని పేర్కొన్నారు. నవంబర్ రెండవ తేదీన శక్కర్‌నగర్‌లో నిర్వహించే యువగర్జనసభకు నియోజకవర్గంలోని యువత భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్..

కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అతనితో పాటు కాంగ్రెస్ పార్టీల నాయకులు శేఖర్, రాంబాబు, నాగులన్న, నయీమ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరడంతో ఎమ్మెల్యే షెకీల్ ఆమేర్ వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విఆర్ దేశాయి, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, అబ్బగోని గంగాధర్‌గౌడ్, శివాలయం చైర్మన్ బీర్యార్ బుజ్జి, కౌన్సిలర్ దూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గజేంధర్, శ్రీను, రాము, గంగారాం, రాజుతో పాటు సుమారు 100 మంది, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, సంజీవ్, రాకేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని రాంనగర్ గ్రామంలోని బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో 28 మంది పార్టీలో చేరారు. రాంనగర్ ఎంపీటీసీ స్వామి, అక్బర్ నవాజుద్దీన్, ఎండి అప్సర్, రజాక్ ఖాన్, షేక్ గఫర్, ధనరాజ్, బంటి, ఫారుక్, ఫెరోజ్ లాల, జుబేర్, హైమద్, షారుక్, ఇమ్రాన్, మోసిన్, రహమత్, శ్రీకాంత్, శంకర్, రిజ్వాన్, అలీమ్, మోహిన్, అంకిత్, వేణు, పోచమల్లు, వల్లపు రాజు తదతరులున్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో అవినీతిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, దేశం బాగుపడాలంటే అవినీతిని అంతమొందించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పవర్ గ్రిడ్ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ ప్రసారాలు, ప్రచురణపై నిషేదం

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ప్రభావం ఎన్నికలపై పడే అవకాశమున్నందున ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1951 లోని సెక్షన్ 126 -ఎ ప్రకారం ఎటువంటి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురణలు, , ప్రసారాలు చేయరాదని ఆయన తెలిపారు. ఈ నెల 7 న ఉదయం 7 గంటల



నుండి ఈ నెల 30 న సాయంత్రం 6. 30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ పై ప్రసారాలు, ప్రచురణలపై నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా రెండేళ్ల జైలు శిక్ష జరిమానా లేదా రెండు ఉంటాయని ఎన్నికల సంఘం పేర్కొందని కలెక్టర్ తెలిపారు.

సాటాపూర్‌లో గడపగడపకు ప్రచారం



ఇస్త్రీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను సర్పంచ్ వికార్‌పాషా వివరించారు. గత పది సంవత్సరాల క్రితం ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే సాధ్యమైందని వారు పేర్కొన్నారు. బుధవారం గ్రామంలోని రజకుల ఇళ్లలోకి వెళ్లి ప్రభుత్వం ఉచిత కరెంటును అందజేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎస్‌కే అహ్మద్, స్థానిక నాయకులు కె.సాయిలు, సురేష్, డైరెక్టర్ సాయిలు, రఫిక్ ఖాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో

- ఎలక్షన్‌లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా క్యాంపెయినింగ్



మాట్లాడుతున్న పిఆర్‌టియు నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలో పిఆర్‌టియు భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం భ్రష్టు పట్టించిందన్నారు. ఊరురా తిరిగి బీఆర్ఎస్‌కి వ్యతిరేకంగా క్యాంపెనింగ్ చేస్తామని అన్నారు. ఉద్యోగాలను సరిగా కండక్ట్ చేయలేదని, అదే విధంగా గవర్నమెంట్ స్కూల్స్, కాలేజీలలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్యక్రమంలో మాధవ్, శివం శంకర్, ఆదిత్య, శివరాజ్, సతీష్, గంగాశంకర్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షన్ బిక్ష కాదు హక్కు

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చే టెన్షన్ బిక్ష కాదని తమ జన్మ హక్కు అని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్పదుర్గ ప్రసాద్ అన్నారు. బుధవారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగుల సంక్షేమాన్ని గుర్తించి, దివ్యాంగుల ప్రత్యేక డిక్లరేషన్ సంక్షేమ పథకాలు ప్రకటించి ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. మాకు పెన్షన్ బిక్ష కాదు మా జన్మ హక్కుగా గుర్తిస్తూ 10 వెలకు పెంచాలని, దివ్యాంగుల బంధు, జీవిత బీమా, పక్క ఇల్ల నిర్మాణం, ఉచిత విద్యుత్, రావాణా సౌకర్యం, విద్య, వైద్యం, ఉద్యోగ, అవకాశాలు కల్పించాలని కోరారు. గ్రామ స్థాయి నుండి చట్టసభలో రిజర్వేషన్ బిల్లు తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యకమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు పాల్గొన్నారు.

పెన్షన్లు సరే.. ఉద్యోగాలు ఏవి?

- బిఎల్‌ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్దిరాములు



ప్రచారంలో పాల్గొన్న బిఎల్‌ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సిద్దిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

వృద్ధులకు పెన్షన్‌లు ఇస్తున్నారని, కానీ చదువుకున్న యువకులకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వడంలేదని, వారి భవిష్యత్తును అంధకారంలోకి ఎందుకు తీసుకెళ్తున్నారని బీఎల్‌ఎఫ్ కామారెడ్డి అభ్యర్థి సిద్దిరాములు ప్రశ్నించారు. బుధవారం కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెన్షన్లు కల్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలు సరే కానీ చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు ఏవి ? వారి భవిష్యత్తు ఏమిటి? వారు కూడా ఈ ఉచిత పథకాలతో బతకవలసిందేనా అని ప్రశించారు. ఓటర్లను కలుస్తూ వారికి ఉచిత పథకాలపై, ఉద్యోగాలపై, నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలపై వివరిస్తూ ప్రచారన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిరిగాద సబిత, ప్రత్యూష, బిఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు యం, ఆంజనేయులు, బి,జగదీష్, సైయ్యద్, జిల్లా నాయకులు, సాయిబాబా, గంగాధర్, గంగ మణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు చేపట్టిన ఇంటింటి ప్రచారం బస్టాండుకు చేరుకోగానే, బి ఆర్ ఎస్ నాయకులు కూడా ప్రచారం నిర్వహిస్తుండగా, ఒకరికి ఒకరు తారసపడ్డారు. ఒకరికి వ్యతిరేకంగా ఒకరు నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్టాండ్ ఆవరణ అంతా కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల నినాదాలతో దద్దరిల్లింది. ఇరు పార్టీల నాయకులు చొరవ తీసుకొని ఎవరి ప్రచారం వారే నిర్వహించుకున్నారు.

రామారెడ్డి బిడ్డను : మదన్‌మోహన్‌రావు

మదన్ మోహన్ రావు శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రామారెడ్డి బిడ్డగా, రామారెడ్డి మట్టిపై పుట్టి పెరిగానని, స్థానిక పాఠశాల విద్యను అభ్యసించానని తెలిపారు. తాను లోకల్ క్యాండెట్ కాదని దుష్ప్రచారం చేస్తున్నారని ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను, కర్ణాటక తరహాలో అమలు చేస్తామని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపిస్తే ప్రజలకు సేవ చేసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అమ్ముల పశుపతి, నర్సింగరావు, వడ్ల లక్ష్మణ్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ముప్కాల్

వేల్పూర్ మండల కేంద్రంలో గురువారం జరిగే 'ప్రజా ఆశీర్వాద సభ'కు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువజన సంఘం నాయకులు, ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, మహిళ కార్యకర్తలు పాల్గొని సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి బుధవారం వేర్వేరుగా ప్రకటనలు చేశారు. 'ప్రజా ఆశీర్వాద సభ'కు వచ్చే జనాల కోసం అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

లింగి తండా పరిధిలో నాలుగు లక్షల ప్రొసీడింగ్స్ అందజేత



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం నిజామాబాద్ రూరల్ మండలంలో లింగి తండా గ్రామ పంచాయతీ పరిధిలో మండల నాయకుల ఆధ్వర్యంలో భారీ మెజారిటీతో గెలిపించాలని, కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మహిళ భవనానికి సొంత నిధుల ద్వారా నాలుగు లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూష ప్రేమ్ నాయక్, స్థానిక సర్పంచ్ అరుణ సాయిలు, జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మండల నాయకులు మధుకర్ రావు, సొసైటీ చైర్మన్ స్వామి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు లడ్డూ సాయిలు, పార్టీ సీనియర్ నాయకులు బొంత సాయిలు, మల్లారం గ్రామ శాఖ అధ్యక్షులు గాజుల శంకర్, ధర్మారం తండా సర్పంచ్ గంగారం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన పలువురు జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జాజాల సురేందర్ మాట్లాడు తూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రతి కార్యకర్త గెలుపు కోసం కృషి సూచించారు. రాష్ట్రంలో అధికారంలో మూడో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌రెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్‌రెడ్డి ఎంపీటీసీ సాయికిరణ్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన సింగిల్ విండో వైస్ చైర్మన్



కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్ చైర్మన్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ మాకం రాములు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. మేగారం గ్రామానికి చెందిన ఆయా పార్టీలకు చెందిన మహిళలు పురుషులతో పాటు 100 మంది పైగా సింగిల్ విండో చైర్మన్ మాకం రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ మాట్లాడుతూ ప్రజలు ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు.

c m y k

నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉండాలి

● జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

నామినేషన్ల స్వీకరణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. బుధవారం కామారెడ్డి ఆర్.డి.ఓ. కార్యాలయంలో నియోజకవర్గ నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు అభ్యర్థులకు అందజేయవలసిన ఫారం-2బి, అఫిడవిట్ ఫారం-26, వారి నుండి తీసుకోవలసిన డాక్యుమెంట్లతో పాటు, అభ్యర్థులకు మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మార్గదర్శకాలపై హ్యాండ్ బుక్ అందజేయాలన్నారు. నామినేషన్ పత్రాలు, అఫిడవిట్ నింపడంలో వారికి సహకరించాలన్నారు.

అభ్యర్థి గదిలోకి ప్రవేశించిన వెంటనే కనిపించే విధంగా డిజిటల్ గడియారం, సి .సి. కెమెరా ఉండాలన్నారు. అభ్యర్థులు తమ వాహనాలను నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరం లో పార్క్ చేసుకునే విధంగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలనీ సూచించారు. ఆన్ లైన్ లో వచ్చే నామినేషన్లకు సంబంధించి



నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ పాటిల్

బౌతికంగా హార్డ్ కాపీ తీసుకోవాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బ్యాలట్ పేపర్ ముద్రణ చేపట్టాలన్నారు.

రెండవ విడత ఈవీఎం, వివిప్యాట్ ల ర్యాండమైజేషన్ నిర్వహించి, పి .ఓ. ఎపిఓ లకు ఈవీఎం, వివి ఫ్యాట్ యంత్రాల నిర్వహణ, బ్యాలట్ పేపర్ సీలింగ్, ఎలక్షన్ ఫారాలు నింపడం, ప్యాకెట్ 1,2,3 మెటీరియల్స్ పై ప్రాక్టికల్ గా అవగాహన కలిగించాలన్నారు. పూర్తిగా బెడ్ కే అంకితమై పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక టీమ్ తో వెళ్లి వారి యొక్క ఓటును స్వీకరించేందుకు తగుఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మాస్టర్ రోల్ తో పాటు అనుబంధ ఓటర్ రోల్ జాబితా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సాధారణ పరిశీలకులకు పోలింగ్ బూతు వారీగా రూట్ మ్యాప్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, మాడల్ పోలింగ్ స్టేషన్ వివరాలు అందించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ లత , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21 రోజుల్లో
రూ.65 లక్షల మద్యం పట్టివేత

● ఎక్సైజ్ అధికారుల వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తేదీ.09.10.2023 నుండి 30.10.2023 వరకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 165 లీటర్ల నాటు సారాయి, 21,525 లీటర్ల బెల్లం ఊట, 19,905 లీటర్ల అక్రమ కల్లు, 412.13 లీటర్ల అక్రమ మద్యం, 408.85 లీటర్ల బీరు, 5.61 లీటర్ల దేశి దారు మద్యం, 7.93 లీటర్ల మహారాష్ట్ర నాన్ డ్యూటీ లిక్కర్, 1266 కేజీల సారాయి తయారీకి ఉపయోగపడే నల్ల బెల్లం, 179 కేజీల పటిక,5 కేజీల క్లోరల్ హైడ్రేట్, 39.9 కేజీల గంజాయి, 20 గంజాయి మొక్కలు, 2, ఫోర్ వీలర్స్, 6 టూ వీలర్స్ సీజ్ చేసినట్టు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 66,15,255 రూపాయల విలువ గల అక్రమ మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు సీజ్ చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే.మల్లారెడ్డి తెలిపారు. అలాగే జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూం (08462237601) ను ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని, ఎవరికైన అక్రమ మద్యం, మత్తు పదార్థాల సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్‌కి తెలియజేయాలని సూచించారు. రానున్న రోజుల్లో దాడులు మరింత ఉధృతం చేసి అక్రమ మద్యం, మత్తు పదార్తలను ఉక్కుపాదంతో అణచి వేసి ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



ఎక్సైజ్ అధికారి

ఖోఖో పోటీలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మాచారెడ్డి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో మాచారెడ్డి జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తృతీయస్థానంలో నిలవడంతో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారి, వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో మండల స్థాయి క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచి అవార్డు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



క్రీడాకారులను అభినందిస్తున ఉపాధ్యాయబృందం

అభివృద్ధిని చూసి..
మరోసారి ఆశీర్వదించండి

● ఊరూరా హన్మంత్‌షిండే ప్రచారం

నవతెలంగాణ-మద్నూర్

'నేను మీ బిడ్డను. లోకల్ వ్యక్తిని. ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఇక్కడే చస్తాను. మరోసారి ఆశీర్వదించండి. మళ్లీ అధికారంలోకి తీసుకురండి. కేసీఆర్ అమలు చేసే హామీల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేస్తా' అంటూ బీఆర్ఎస్ జుక్కల్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్‌షిండే తెలిపారు. బుధవారం మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్, హెచ్ కేలూర్, చిన్న షక్కర్గా, పెద్ద షక్కర్గా, గోజేగావ్, గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రచారానికి ఆయా గ్రామాల ప్రజలు నీరాజనాలు పలుకుతూ మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తే కేసీఆర్ ప్రకటించిన మానిఫేస్టో అమలు చేస్తామని అన్నారు. కల్లా బొల్లి మాటలు చెప్పే ఇతర పార్టీల నాయకులు ప్రజలకు మభ్య పెట్టేందుకు అమలు చేయని వాగ్దానాలు మాట్లాడుతున్నారని అలాంటి పార్టీలకు నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటూ అండగా నిలుస్తుందని తెలిపారు.

గోజేగావ్ గ్రామంలో ఎన్నికల సభలో ఉమ్మడి మండల నివాసులైన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో గోజేగావ్ గ్రామ సర్పంచ్ అనిత ఇరవంత్ దేశ ముఖ్, చిన్న షక్కర్గా గ్రామ సర్పంచ్ షేక్ గఫర్, హెచ్ కేలూర్ ఎంపీటీసీ సభ్యులు విజయ్, పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయస్వామి ఆలయ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్, డిసిసిబి డైరెక్టర్ రాంపటేల్, మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్ డోంగ్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మధుకర్ పటేల్ మద్నూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బన్సీ పటేల్ డోంగ్లి మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శశాంక్ పటేల్ మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ దిగంబర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ధాన్యం లారీ బోల్తా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ముల్లంగి నుంచి నిజామాబాద్ వైపు ధాన్యం సంచులతో వెళు తున్న లారీ బుధ వారం సాయంత్రం డిచ్‌పల్లి మండల కేంద్రం లో బోల్తా పడింది. లారీకి సంబంధించిన పట్టీలు విరిగిపోవడంతో లారీ ఒకవైపు కుంగింది. దీంతో లారీలో ఉన్న ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ధాన్యం సంబంధీకులు చేరుకుని ధాన్యం సంచులను ఇతర లారీలో కేటాయించిన రైస్‌మిల్లుకు తరలించారు.



లారీబోల్తా పడ్డ దృశ్యం

యాసంగి పంటల సాగుపై సదస్సు

నవతెలంగాణ-గాంధారి

యాసంగి పంటల సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధారి మండల పరిధిలోని పోతంగల్ కాలన్ రైతు వేదికలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. అనీల్ రెడ్డి మాట్లాడుతూ మొక్క జొన్న, శెనగ, నువ్వులు, జొన్న, పొద్దుతిరుగుడు, కుసుమలు మరియు గోదమలు వంటి పంటల సాగు విధానం లోని మెళుకువలను వివరించారు. అదే విధంగా వివిధ పంటలో వచ్చే ఎండు తెగులు నివారణ కోసం ట్రైకో డర్మా విరిడే 5 -10 గ్రాములు కేజి విత్తనానికి కలిపి వితనశుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ఏ ఈ ఓ షోయబ్ అహ్మద్ మరియు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనీల్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు బుధవారం ప్రారంభించారు. గాంధారితో పాటు మాతు సంగెం, గుర్జాల్,పేట్ సంగం, బ్రాహ్మణపల్లి, చిన్నపోతంగల్ గ్రామాల్లో కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఏవో నరేష్, ,మానిటరింగ్ ఆఫీసర్ సురేష్, కార్యదర్శి మోహన్ రెడ్డి, సంఘం సిబ్బంది గాండ్ల సాయిలు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

కోత యంత్రం ఢీకొని వృద్ధుడు మృతి

నవతెలంగాణ-లింగంపేట్

వరి కోత యంత్రం ఢీకొనడంతో వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామానికి చెందిన షాబుద్దీన్ (70) గ్రామంలోని ప్రధాన కూడలి బస్టాండ్ ప్రాంతంలో వద్ద గల బి ఆర్ ఎస్ గద్దెపై ఎండ కోసం కూర్చున్నాడు. అయితే అక్కడే ఉన్న వరి కోత మిషన్ డ్రైవర్ వరి కోత మిషన్‌ను రివర్స్ చేస్తున్న సమయంలో షాబుద్దీన్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. లింగంపేట ఎస్సై ప్రభాకర్ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ప్రమాదం గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వరి కోత మిషన్ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



మృతి చెందిన షాబుద్దీన్